# కలలు కన్న రాధ

వాసవి తడబడే అడుగుల్తో, ఆరోజు పోస్ట్‌మాన్ చేతుల్లోంచి అందుకున్న అపాయింట్‌మెంట్ ఆర్డర్ చేతిలో పెట్టుకుని గుండెలు దడదడలాడుతుండగా ఎమ్. అనిల్‌కుమార్ ఎమ్.ఎ. నేమ్ ప్లేట్‌ను చూస్తూ స్ప్రింగ్ డోర్స్ తెరిచి చేత్తో పట్టుకుని లోపలికి చూసింది.

విశాలమైన గది... చక్కటి పాలరాతితో మెరుస్తున్న గోడలు, సీలింగ్... ఎఱ్ఱటి మెత్తటి కార్పెట్ పరచిన నేల, విశాలమైన డెకోలామ్ టేబిల్, అందమైన కుర్చీలు... గోడలకు చక్కటి పెయింటింగ్స్... విశాలంగా ఉన్న కిటికీల్లోకి అందంగా పాకిన మనిప్లాంట్, మాధవీ లతలు... అవి మోసుకొస్తున్న చల్లటి గాలికి షాంపూ చేసుకున్న జుట్టు నుదుటిమీద పడుతుండగా, ఉదారంగు 'టై' సున్నితంగా కదుల్తుండగా తలవంచుకుని సీరియస్‌గా వ్రాసుకుంటున్న అందమైన యువకుణ్ణి చూస్తూ రెప్పవేయటం మర్చిపోయింది. తేరుకుని మెల్లగా ''మే ఐ కమిన్ ప్లీజ్'' మెల్లిగా అన్నది.

వీణ మీటినట్టున్న ఆ కంఠస్వరానికి తలెత్తి చూసిన అతను, ఎదురుగా ఉన్న ముగ్ధమోహన రూపాన్ని చూసి విస్మితుడయ్యాడు.

''అబ్బ రాధా! ఓ రాధా! ఏం చేస్తున్నావ్? పని తెవలటంలేదు. కాస్త వచ్చి ఈ పచ్చడి నూరిపో...'' లోపల్నుంచి సుభద్రమ్మగారి కంఠం కంచులా విన్పించి అనూరాధ చదువుతున్న పత్రికలోంచి ఠక్కున బైటపడింది... విసుగ్గా పత్రిక టేబిల్‌మీదకి విసిరేసి చరచరా వంటింట్లోకి నడిచింది.

''ఎంతసేపూ పత్రికలేనా!... ఆడ పిల్లవి కాస్త నాకు సాయం చేయాలని ఉండదేం?'' విసుగ్గా రాధను చూస్తూ అన్నది సుభద్రమ్మ.

రాధ కోపంగా వేయించిన మిరపకాయలు రోట్లో వేసి టక టక నూరుతూ ''ఇంట్లో నాకేం తోచటం లేదు, ఏం చేయను...? వెధవ పని ఎప్పుడూ

ఉండేదే. ఆ పుస్తకాలు కూడా లేకపోతే ఏమైపోతాను? ఉద్యోగం చేస్తానంటే చేయనివ్వరు...'' అంటూ సణిగింది.

''ఏడిసినట్టే ఉంది. ఉట్టి కెక్కలేనమ్మ స్వర్గాని కెక్కిందట... ఇంట్లో పనికే ఇంత హైరాన పడుతున్నావ్ ఆఫీస్‌కెళ్ళి ఉద్యోగమేం చేయగలవింక'' తల్లి మాటలకి రోషంగా అన్నది... ''ఉద్యోగం చేస్తే లోకంతీరు తెలుస్తుంది. నలుగుర్లో ఎలా మెలగాలో తెలుస్తుంది. వంట చేస్తే ఏంవొస్తుంది. ఇంతోటి వంట నాకు రాకపోలేదు...'' రాధ అన్నమాటల్లో నిజం వున్నా ఆ అమ్మాయి ఉద్దేశ్యం మాత్రం అది కాదు...

రాధ - సుభద్ర, ప్రసాదరావులకు మూడో కుమార్తె. ఇద్దరికీ పెళ్ళిళ్ళు చేశారు... రాధ పట్టుదల వల్ల, రాధ అన్నయ్యలిద్దరి ప్రోద్బలం మీద ఆ అమ్మాయిని కాలేజీలో చేర్పించి బి.ఏ. చెప్పించారు. చక్కగా టైపు, షార్ట్‌హ్యాండ్ పాసయింది. ఇంక ఇంట్లో కూర్చోబెట్టి సంబంధాల వేట ప్రారంభించారు.

కాని అనురాధకది నచ్చలేదు. తనకన్న పెద్దవాళ్లు పెళ్ళిళ్ళుకాక ఇంకా కన్నెపిల్లల్లా ఉంటే తనకప్పుడే పెళ్ళేమిటని అనుకొంది. చక్కగా ఉద్యోగం చేయాలనీ, తను చదివే నవల్స్‌లోలా ఏ అందమైన ఆఫీసరో తన అందానికి, తెలివి తేటలకి ముచ్చటపడి తనను ప్రేమించి పెళ్ళి చేసుకొంటాననాలనీ, ముందు తాను తిరస్కరించాలనీ, అతను తన కోసం పిచ్చివాడు కావాలనీ, తను జాలితో అతనికి శుశ్రూషలు చేసి దగ్గరవ్వాలనీ... ఆ తరవాత కథ సుఖాంతం కావాలనీ... ఇలా ఎన్నో కలలు రాధ కన్నె మనసులో అల్లరి చేస్తున్నాయి.

తల్లీ, తండ్రీ రాధ ఉద్యోగం చేయటానికి ఒప్పుకోవటం లేదు. అదీ ప్రైవేట్ కంపెనీలోనే చేయాలనే రాధ కోరికను అసలు సమర్థించటం లేదు. ఆ విషయమై రోజూ తల్లితో వాదిస్తూనే ఉంటుంది. తండ్రిని బతిమాలుతూనే ఉంది...

రోజూలా ఆ రోజు కూడా రాధ అన్న మాటలను విన్న ప్రసాదరావుగారు చదువుతున్న క్రానికల్ మూసేసి ఒక్కక్షణం ఆలోచించారు. నిజమే రాధ అన్నది... పోనీ పెళ్ళి కుదిరిందాకా చేస్తే దాని సరదా తీరుతుంది కదా! అనుకుని ''అమ్మాయ్ రాధా'' అని పిలిచారు.

రాధ పచ్చడి రుబ్బటం పూర్తిచేసి తండ్రి దగ్గరకు వచ్చింది... ''చూడమ్మా

ఇందులో ఏదో వాంటెడ్ కాలమ్ పడింది... చూసి అప్లై చేయి...'' అన్నారు క్రానికల్ రాధ చేతికిస్తూ.

రాధకి ఆశ్చర్యం, ఆనందం కూడా కలిగాయి. తండ్రి తనంత తానుగా ఉద్యోగానికి అప్లై చేయమనటం శుభసూచకంగా అనిపించి ఉత్సాహంగా పేపర్ తీసుకొని ''అలాగేనాన్నా'' అంటూ తన గదిలోకి పరిగెత్తి, తన క్వాలిఫికేషన్స్‌కి సూటయే రెండు మూడు ఉద్యోగాలకి అప్లికేషన్ వ్రాయటానికుపక్రమించింది.

★ ★ ★

అప్లికేషన్స్ పోస్ట్‌చేసి వారం కావస్తోంది... రాధ కన్నులు కాయలు కాచేలా పోస్ట్‌కోసం ఎదురుచూస్తోంది. వారం, పదిహేను రోజులు గడిచినా రాలేదు. నెలలో మళ్ళీ రెండిటికి అప్లై చేసింది. రెణ్ణెల్లు దాటినా ఇంటర్వ్యూ ఒక్కదానికీ రాలేదు.

''ఈ క్రానికల్‌లో అడ్వర్టైజ్‌మెంట్ కేవలం నామ్‌కేవాస్తే, వాళ్ళు కాండిడేట్‌ని ఎప్పుడో సెలక్ట్ చేసుకుని ఉంటారు.'' అన్నాడు రాధ చిన్నన్నయ్య...

''మరి ఎందుకిలా పేపర్‌లో ప్రకటించడం వాళ్ళు ఏడవటానికా? మనల్ని ఏడిపించటానికా?'' ఉక్రోషంగా అన్నది.

''రెండోదే కరెక్ట్ -'' అనేసి బైటికెళ్ళి పోయాడు. రాధ ఉడుక్కుంది.

మర్నాడు 'హిందూ' కొని చూసింది... ఒక పెద్ద ఫర్మ్‌కి స్టెనో కావాలని పడింది... వెంటనే అప్లై చేసింది...

పదిరోజులు గడిచాయి. రాధకు ఇంటర్వ్యూకి కాల్ లెటర్ వచ్చింది... రాధ సంతోషానికి పట్టపగ్గాలు లేవు. ఇంటర్వ్యూ కెళ్ళటానికి మర్నాడు పెందలాడే లేచింది. స్నానంచేసి, చూడగానే వాళ్ళు కోరుకున్నట్లు స్మార్ట్‌గా కన్పించాలని లెమన్ ఎల్లో ఫారెన్ నైలెక్స్ శారీ, అదే బ్లౌజ్ వేసుకుంది. నిజంగానే రాధ అందంగా ఉంది... దైవ ప్రార్థన చేసుకుని బస్టాప్‌కి నడిచింది.

బస్‌కోసం ఎదురుచూస్తూన్న రాధ ఆలోచనలు తను వెళ్ళబోయే ఇంటర్వ్యూ మీదికి, ఆఫీసర్ మీదికి మళ్ళాయి. తను కోరుకున్నట్లు పెద్ద ప్రైవేట్ కంపెనీలో ఇంటర్వ్యూ వచ్చింది... తప్పకుండా జాబ్ కూడా వస్తుంది. తనకన్నా స్మార్ట్‌గా ఉన్నవాళ్లు వస్తారా?... ఏడిశారు...

రాధకి తను చదివిన కథ గుర్తొచ్చింది. వాసవిని ఎంత అందంగా వర్ణించింది

రచయిత్రి! అనిల్‌కుమార్‌కి తగిన జోడిగా కుదిర్చింది. వాసవికన్నా తను అందగత్తె. తప్పకుండా అనిల్‌లాంటి ఆఫీసరైతే తనను చూడగానే ఐసైపోడూ...

ఆ కథలో ఉద్యోగం కోసం వెళ్ళిన వాసవిని చూసి, క్వాలిఫికేషన్స్ కూడా అడక్కుండా కేవలం ఆవిడ అందానికి దాసుడై తన సెక్రటరీగా అపాయింట్ చేస్తాడు. సెక్రటరీ క్రమంగా ప్రేయసి అవుతుంది... నిజంగా వాళ్ళిద్దరి మధ్యా రొమాన్స్ ఎంత చక్కగా వ్రాసింది ఆవిడ... అది చదువుతుంటే వాసవి రాధగా మారిపోయింది... ఆరోజునుంచీ అనిల్ రూపం కళ్ళకు కట్టినట్టే కన్పిస్తోంది.

చివరికి ఇద్దరూ పెళ్ళిచేసుకుంటారు... అబ్బ అనిల్ ఇల్లు ఎంత డాబుగా... కళ్ళకు కట్టినట్టు వర్ణించిందని... వాసవిలాంటి బీదపిల్ల అలాంటి ఇంటికి యజమానురాలు - తానూ అంత అదృష్టవంతురాలైతే... ఆలోచనల్లో ఉండగానే టైమ్ అరగంట దాటింది. ఇంకా బస్ రాలేదు. ఒకటి రెండు వచ్చి బస్టాప్‌కి అరమైలు దూరంలో ఆగాయన్న సంగతి అనూరాధ గ్రహించలేదు.

''ఛీ, ఛీ ఈ ఆర్.టి.సి. రాను రాను అధ్వానంగా తయారవుతోంది. అరగంట గడిచినా బస్సు రాలేదు. పదింటికి చేరాల్సిన ఆఫీస్‌కి లంచ్ టైమ్‌లో చేరినా అదృష్టమే'' కా స్సే పు ఆర్.టి.సి. వాళ్ళని తిట్టుకొంది.

అంతలోకే పిప్పళ్ళ బస్తాలా భారంగా వచ్చింది బస్సు. జనం కిటకిట లాడుతున్నారు. ఎక్కేవాళ్లు దిగేవాళ్ళని, దిగేవాళ్లు ఎక్కేవాళ్ళని ఒకళ్ళనొకళ్ళు తోసుకుంటున్నారు. అనూరాధకి కళ్ళనీళ్ళపర్యంతమయింది. ఈ బస్ మిస్ చేసుకొంటే ఇంటర్వ్యూ టైమ్ దాటిపోతుంది... అనుకుంటూ ఎలాగో ప్రయాసపడి బస్ ఎక్కింది.

''రామ్ అండ్ కంపెనీ'' తాటికాయంత అక్షరాల్తో ఉన్న ఆ బోర్డ్‌ని చూస్తూ దడదడలాడే గుండెలతో లోపలికడుగు పెట్టింది. ఎంతోమంది అమ్మాయిలొచ్చారు... అందరూ బెల్‌బాటమ్స్, మాక్సీలతో రంగు పూసుకున్న పెదాల్తో, బాబ్డ్ హేర్స్‌తో అధునాతనంగా ఉన్నారు. చీర కట్టిన వాళ్లున్నా, వాళ్ళు బొడ్డు క్రిందకట్టిన చీరతో షోకేసుల్లో బొమ్మల్లా ఉన్నారు.

అనూరాధకి ఒక్కక్షణం అసూయ కలిగింది. సాధారణంగా ప్రైవేట్ కంపెనీల్లో ఇలాగే ఉంటారు లేడీస్. తానూ తన అమ్మమ్మ వేషం అనుకుంది.

కాని వాసవి గుర్తు రాగానే ఇలా అలంకరించుకుని ఆంధ్రుల ఆడపడుచులా ఉందనేగా అనీల్ మోహించాడు అనుకుని సంతృప్తి పడింది.

అందరి కళ్ళూ తనమీద నిలవగానే గర్వంగా ఫీలయింది... ''మీ కేదన్నా రికమండేషన్ ఉందా?'' ఒకమ్మాయి అడిగింది ఇంగ్లీషులో...

''లేదు.'' అన్నది ముభావంగా... ఇంతలో ఇంటర్వ్యూ మొదలైంది... ఒక్కొక్కళ్ళే లోపలి కెళ్తున్నారు. వాళ్ళ రాకకోసం మిగతా వాళ్ళు ఆత్రంగా చూస్తున్నారు.

పదిహేను నిమిషాల్లో రాధవంతు వచ్చింది. గజగజ వణికిపోతున్న శరీరాన్ని స్వాధీనంలోకి తెచ్చుకుంటూ లోపలికి నడిచింది. లోపలున్న వాళ్ళని చూస్తూనే నీరు కారిపోయింది. వాళ్ళల్లో ఒకాయన నల్లగా, ఎఱ్ఱటి కళ్ళతో బాగాబలంగా ఉన్నాడు. ఇంకొకాయన ఎఱ్ఱగా, బాగా పండిన జామపండులా పొట్టిగా లావుగా ఉన్నాడు. ఇద్దరికీ కూడా బట్టతల.

ఏవో కొన్ని ప్రశ్నలేశారు. అన్నిటికీ సమాధానాలిచ్చింది. ఏదో కొంచెం మేటర్ డిక్టేట్ చేసి అది టైప్ చేయమన్నారు. అన్నీ చేసి బైటపడిన రాధ హాయిగా ఊపిరి పీల్చివదిలి... ''భగవంతుడా ఇందులో సెలక్ట్ చేయకు...'' అని ప్రార్థించింది.

★ ★ ★

కాని రాధ మొరవినలేదు భగవంతుడు... అపాయింట్‌మెంట్ ఆర్డర్ చూసి రాధ క్రుంగి పోయినా, ఇంట్లో వాళ్ళంతా సంతోషించారు... చేరకపోతే అందరూ గేలిచేస్తారని ఆరోజు జాయిన్ అవటానికి బయల్దేరింది. పోనీలే ఇది చేస్తూ మంచి జాబ్ చూసుకోవచ్చు అనుకుంది.

ఆరోజు నుంచీ రాధ ఆ పెద్ద కంపెనీలో స్టెనోగా జీవితం ప్రారంభించింది. టైపిస్ట్ పరిమళ, టెలిఫోన్ ఆపరేటర్ రజియా ఇద్దరు కాక రాధ... ముగ్గురే లేడీస్. పరిమళ క్రిస్టియన్.. అయినా రాధతో పరిమళకు మంచి స్నేహం ఏర్పడింది.

ఆఫీస్‌లో అంతా రాధ అందాన్ని పొగుడుతారు... ''టీ''లకి ఆహ్వానిస్తారు... రాధ చిరు నవ్వుకే పొంగి పోతారు. కాని రాధకు చిరాకు కలిగేది... అనుకున్నట్టు జరగలేదనే అసంతృప్తి పెరిగిపోయింది.

ఆర్నెల్లు గడిచాయి... ఆఫీసుకెళ్ళటం, రావటం, నిద్రపోవటం... యాంత్రికంగా గడుపుతోంది రోజులు... కనిపించిన ఉద్యోగానికల్లా అప్లికేషన్ పడేస్తోంది... అసంతృప్తితో నీరసించింది రాధ... తల్లి ఉద్యోగం మానేసి

ఆరోగ్యం కాపాడుకోమని సణగసాగింది...

రాధకు్కూడా అలాగే అన్పించేది... థ్రిల్, ఉత్సాహం లేని ఈ ఉద్యోగం దేనికి? అని. కాని తాను పట్టుదలగా ఉద్యోగంలో చేరటంతో వెంటనే మానేస్తే అందరూ నవ్వుతారని ఊర్కుంది.

ఆఫీస్ కెళ్ళగానే పరిమళ ఒక శుభవార్త చెవిన వేసింది. ''వారం రోజుల్లో మనకి క్రొత్త బాస్ వస్తున్నారుట... ఇప్పుడున్న ఆయనకి బంధువట. అంటే చెల్లెలి కొడుకో ఏదోట - ఇతనేమో బాంబేలో ఉన్న బ్రాంచికి వెడతాట్ట. వచ్చే అతని పేరు దినేష్. ఎమ్.ఏ.'' గడగడా చెప్పేసింది...

రాధ హృదయంలో పన్నీటి జల్లు కురిసింది. మల్లెలు పూశాయి... కోటి కోయిలలు గొంతెత్తి పాడాయి. చాలా హుషారుగా పని చేసింది. అంత హుషారుగానూ ఇంటికెళ్ళింది.

దినేష్ రాకకోసం ఎదురు చూడసాగింది... ఎంత మంచి పేరు... ఇన్నాళ్ళకి తనకలలు ఫలించబోతున్నాయి. తప్పక తన అందానికి మోహితుడవుతాడు. ఆ ఆఫీస్‌లో ఉన్న అందమైన అమ్మాయి తనే కదా! ఆపరేటర్ ఎంత మోడ్రన్‌గా అలంకరించుకున్నా వేస్టే... ఇంక పరిమళను చూస్తే మరోసారి ఎవరూ చూడాలనుకోరు.

అంబాసిడర్ కారులో అందమైన అతని ప్రక్కన కూర్చుని హాయిగా షికార్లు, సినిమాలు చూసేస్తుంది.

''రాధా ఇంత అందం నాకోసం ఇన్నాళ్లుగా ఎదురుచూస్తోందని నాకు తెలీదు సుమా!'' కొంటెగా అంటాడు దినేష్. తాను...మత్తుగా అతని ఒడిలో ఒదిగిపోతూ ఊహు అంటుంది. అనురాధ మనసంతా తీయని ఊహల్తో బరువెక్కింది. ఆవిడ కళ్ళముందు... వాసవీ అనీల్ కదిలారు... ఆ జంటలాగే తమజంట కూడా పదుగురికీ కనువిందు చేయాలి.

అలా కలల్లో ఉండగానే అనూరాధ ఎదురు చూసిన రోజు వచ్చింది. ఉదయాన్నే లేచి తలంటుకుంది. తల్లి '' ఇవాళ శుక్రవారం కాదుగా ఎందుకే తలంటు'' అంటే ''చికాగ్గా ఉందమ్మా'' అంటూ శుభ్రంగా రుద్దేసుకుంది. తన అందాన్ని ద్విగుణీకృతం చేసే గులాబీరంగు దుస్తులు ధరించింది. గులాబీ ఒకటి చెవిక్రిందుగా తల్లో పెట్టుకుంది. కలల అలల మీద తేలిపోతూ ఆఫీస్‌లో అడుగు పెట్టింది.

పరిమళ కూడా కొత్తరకం డ్రెస్‌లో కళ్ళల్లో కోరికలు నింపుకుని అట్రాక్టివ్‌గా వచ్చింది... స్టాఫ్ అంతాకూడా క్రొత్త ప్రొప్రయిటర్‌కి స్వాగతం పలికేందుకు నీట్‌గా డ్రెస్ అయి వచ్చారు...

అనూరాధ కళ్ళు మాటిమాటికీ ఎంట్రన్స్ వైపు చూస్తున్నాయి. చెవులు కారు హారన్ కోసం ఎదురు చూస్తున్నాయి.

పరిమళ అన్నది ''అనూ! క్రొత్తాయన ఎలాంటివాడో, అందులో యంగ్‌మాన్, భయంగా లేదూ!''

''ఎందుకూ భయం'' ఆశ్చర్యంగా అడిగింది రాధ...

''ఏమో కఠినమైన రూల్స్ ప్రవేశ పెడ్తే... అయినా నిన్ను చూసి ఎలాంటివాడైనా ఐస్సై పోతాడులే ఈ డ్రెస్‌లో ఎంత లవ్లీగా ఉన్నావో తెలుసా!...'' రాధ సిగ్గుపడి నవ్వేసింది.

అందరూ కొత్త ప్రొప్రయిటర్ గూర్చి రకరకాలుగా ఊహాగానాలు చేయసాగారు. ఇంతలో కారు చప్పుడు వినిపించింది. ప్యూన్స్ హడావుడిగా పరిగెత్తారు. రాధ గుండెలు కొట్టుకున్నాయి రెట్టింపు వేగంతో.

ఆయన గౌరవార్థం అందరూ లేచి నిలబడ్డారు. గ్లాస్‌డోర్స్ తెరుచుకున్నాయి... పాత ప్రొప్రయిటర్ వెనకాల ఎర్రగా, గిరజాల జుట్టుని పైకి ఎగదువ్వి, లావుగా కొంచెం పొట్టిగా, పెద్ద పొట్టతో గుమ్మటంలా ఉన్న ఒకతను లోపలికొచ్చాడు.

రాధ కళ్ళు వాళ్ళ వెనుక నల్లని క్రాఫింగ్ చిందర వందరగా నుదుటిమీద పడుతుంటే, కూలింగ్ గ్లాసెస్ విలాసంగా చేతిలో త్రిప్పుతూ ఫుల్‌సూట్‌లో వచ్చే స్పురద్రూపి కోసం చూస్తున్నాయి. పాత ప్రొప్రయిటర్ గుమ్మటంలా ఉన్నతన్ని ఒక్కొక్కరికే పరిచయం చేస్తున్నాడు... ''హీ ఈజ్ మిస్టర్ దినేష్ ఎమ్.ఏ -'' అంటూ.

రాధ వంతు వచ్చింది. ''మిస అనూరాధ... స్టెనో...'' దినేష్ కళ్ళు రాధని తినేసేలా చూస్తున్నాయి. పాన్‌తో పండిన నోరు బారలా తెరిచి ''వాట్ ఎ బ్యూటీ'' అన్నాడు.

రాధకి అతని తెరచిన నోరు చూస్తుంటే కడుపులో తిప్పినట్లయి తన కలలన్నీ కళ్ళముందు కూలిపోతుంటే.. పాలిపోయిన మొహంతో విష్ చేయటం మర్చిపోయి నిలబడి పోయింది.

ఆంధ్రభూమి వార పత్రిక